ఈదురుగాలులతో వర్షం

ఉట్నూర్ రూరల్, జూన్ 11 : మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొలాంగూడ సమీపంలో ప్రధాన రోడ్డుపై భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రాకపోకలు నిలిచాయి. పిట్లగూడ గ్రామంలో రాపెల్లి పోసవ్వ ఇంటిపైన వేసిన రేకులు ఈదురుగాలులకు లేచిపోయాయి. కొమ్ముగూడ గ్రామంలో బామని స్వామికి చెందిన ఆవు పిడుగుపాటుతో మృతి చెందింది. భారీ వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొలాంగూడ సమీపంలో రోడ్డుపై నేలకొరిగిన వృక్షం

ఎంపికైన విద్యార్థులు బాగా చదవాలి..

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 11 : 2024-25 విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ అవైలెబుల్ స్కూల్ పథకంలో ఎంపికైన విద్యార్థులు బాగా చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నూతన అంబేద్కర్ భవనంలో ఎస్సీ సంక్షేమ అభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న బెస్ట్ అవైలెబుల్ స్కూల్ పథకంలో ఎస్సీ విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఏఎస్‌డబ్ల్యూవోలు నారాయణ రెడ్డి, నర్సింగ్, సూపరింటెండెంట్ పూర్ణచందర్‌రావు, హెచ్‌డబ్ల్యూవోలు దత్తు, విఠల్, శ్యామ్, శ్రీను పాల్గొన్నారు.

లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

సమస్యలను పరిష్కరించాలి..

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఎదులాపురం, జూన్ 11 : మధ్యాహ్న భోజన కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్నం భోజన పథకం కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని, గుర్తింపు కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రం వద్ద దరఖాస్తుదారులు

గ్యారెంటీ గోస

జీరో బిల్లులు, రూ.500ల సిలిండర్ కోసం అవస్థలు

- ఎడిట్ ఆప్షన్ లేక వర్తించని పథకాలు
- ఎన్నికల కోడ్ తర్వాత మళ్లీ ప్రారంభమైన ప్రజాపాలన కేంద్రాలు
- సవరణల కోసం పరుగులు పెడుతున్న జనాలు

ఆదిలాబాద్, జూన్ 11(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతేడాది డిసెంబర్ 28వ తేదీన ప్రారంభమైన ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులు సమర్పించారు. ఆధార్, రేషన్ కార్డు, కరెంటు మీటరు నంబరు, గ్యాస్ సిలిండర్ కనెక్షన్ నంబరు, ఇతర వివరాలతో ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1,61,366 మంది 200 యూనిట్ల ఉచిత కరెంటు సరఫరాలో భాగంగా గృహజ్యోతి పథకానికి.. 85,210 మంది మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500 సిలిండర్ కోసం తమ వివరాలను అందజేశారు. కానీ.. మొదటి నెలలో సగం మందికిపైగా జీరో బిల్లులు రాకపోవడంతో జనం అధికారులను సంప్రదించారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500 సిలిండర్ కూడా రాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందారు. వివరాల నమోదులో భాగంగా తప్పులు దొర్లడంతో అర్హులకు జీరో బిల్లులు, రూ.500 సిలిండర్ అందకపోవడంతో ప్రభుత్వం మళ్లీ ప్రజాపాలన కేంద్రాలను ప్రారంభించి దరఖాస్తుల సవరణకు అవకాశం కల్పించింది. దీంతో జనం ప్రజాపాలన కేంద్రాల్లో బారులుదీరి తమ వివరాలను నమోదు చేసుకుంటున్నారు.

ఎడిట్ ఆప్షన్ లేక వర్తించని పథకాలు

ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కేంద్రాలను మూసివేసింది. కోడ్ ముగిసిన తర్వాత గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకం లబ్ధిదారులు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500 సిలిండర్ పొందడానికి వీలుగా ప్రజాపాలన కేంద్రాలను తిరిగి ప్రారంభించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ప్రజాపాలన కేంద్రానికి దరఖాస్తులుదారులు వచ్చి తమ వివరాలను అందజేస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు సరిగా చేపట్టకపోవడంతో అర్హులైన వారు ఈ పథకాలను దూరమవుతున్నారు. దరఖాస్తులో తమకు వర్తించే పథకాలను సిబ్బంది సరిగా నమోదు చేయలేదు. ప్రజాపాలన కేంద్రాలకు వచ్చిన వారి వివరాలను చూస్తే ఆన్‌లైన్‌లో నాట్ అప్లయిడ్ అని చూపిస్తున్నది. ఇలాంటి వారి విషయంలో తాము ఏమీ చేయలేమని, ఎడిట్ అప్షన్ ఇస్తే సవరించే అవకాశాలు ఉన్నాయని సిబ్బంది అంటున్నారు. దీంతో పేదలు చేసేదేమీ లేక వెనుదిరుగుతున్నారు. కూలీ పనులు చేసుకునే తాము రెండు పథకాలకు అర్హులమని మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో తాము వేల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రయాణికులకు అనుగుణంగా సర్వీసులను నడపాలి

డిపో ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సంఘం నాయకులు

డీఎంకు విన్నవించిన పీఓడబ్ల్యూ నేతలు

నిర్మల్ అర్బన్, జూన్ 11 : ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులను నడిపించాలని, నూతన బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం డిపో ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డిపో మేనేజర్ ప్రతిమారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణాన్ని కల్పించడంతో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో అధికంగా ప్రయాణం చేస్తున్నారని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నూతన సర్వీసులను కొనుగోలు చేయాలని, ఆర్టీసీలో కొత్త ఉద్యోగులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజన్న, గంగామణి, లక్ష్మి, కవిత, విజయ, వసంత, తైసీన్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌కు కదలని బస్సులు

- నిర్మల్ జిల్లాలో 317 బడి బస్సులు
- ఇప్పటివరకు ఫిట్‌నెస్ చేసుకున్నవి 73..
- ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే కేసులు చేస్తాం : ఎంవీఐ

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ఫిట్‌నెస్‌కు వచ్చిన స్కూలు, కళాశాలల బస్సులు (ఫైల్)

నిర్మల్ అర్బన్, జూన్ 11 : నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థుల నమోదు శాతం పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పదిహేనేండ్లకు పైబడి కాలం చెల్లిన వాహనాలను ఇతర రాష్ట్రాల నుంచి అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి, పైపైన రంగులు అద్దుతూ రోడ్లపై తిప్పుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలకు తావిస్తున్నది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 317 ప్రైవేటు పాఠశాలల బస్సులు ఉండగా ఇప్పటివరకు కేవలం 73 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేసినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. వీటిలో గతేడాది కొత్తగా బస్సులను కొనుగోలు చేయగా.. రెండేండ్ల వరకు ఎలాంటి ఫిట్‌నెస్ అవసరం లేదు. ఇంకా 242 ప్రైవేటు బస్సులు ఫిట్‌నెస్ పరీక్షకు రావాల్సి ఉంది.

నిబంధనలు ఇవే..

- పాఠశాల పేరును బస్సుపై కనిపించే విధంగా రాయించాలి.
- బస్సులో ఫస్ట్ ఏయిడ్ బాక్సు, మందులు, కిట్‌లు అందుబాటులో ఉంచాలి.
- బస్సుల కిటికీల వద్ద చేతులు, తలలు బయట పెట్టకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయించాలి.
- బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలను ఆర్పేందుకు పరికరాలను అందుబాటులో ఉంచాలి.
- ప్రమాదాలు జరిగినపుడు వెంటనే బయటకు తీసేందుకు ఎమర్జెన్సీ తలుపు ఉండాలి.
- పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకోవద్దు. బస్సులో విద్యార్థుల వివరాలు, అడ్రస్ ఉంచాలి.
- పుట్‌బోర్డు, హైండ్ బ్రేక్ అందుబాటులో ఉండాలి.
- బ్యాగులు పెట్టుకునేందుకు ర్యాక్‌లు అందుబాటులో ఉంచాలి.
- 50 ఏండ్లు పైబడిన వారిని తీసుకోకూడదు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- వాహనాలు నడిపే డ్రైవర్ కంటి పరీక్ష చేసుకోవాలి.
- బస్సులు కండీషన్‌లో ఉండి.. రూఫ్‌టాప్, నాణ్యమైన సీట్లు అందుబాటులో ఉండాలి.
- వీటితోపాటు ట్యాక్సులు చెల్లించి, పర్మిట్ కలిగి ఉండాలి. వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్సు, డ్రైవింగ్ లైసెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలి.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేసులు నమోదు చేస్తాం..

పాఠశాల ప్రారంభం లోపు అన్ని ప్రైవేటు పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ చేసుకోవాలి. లేకుండా రహదారులపై నడిపితే ఎంవీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తాం. పాఠశాలలు ప్రారంభానికి ముందే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాలి.

- మహేందర్, ఎంవీఐ, నిర్మల్ జిల్లా.

బొట్టు పెట్టి.. మొక్క ఇచ్చి..

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఇంటింటి ప్రచారం

ఎదులాపురం, జూన్ 11 : 'ప్లే స్కూల్ లేదని చింత ఎందుకు.. ప్రీ స్కూల్ మీ చెంత ఉండగ..' అంటూ అంగన్‌వాడీ టీచర్లు ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రం-1లో ఇంటింటికీ తిరుగుతూ బొట్టు పెట్టి, మొక్క ఇచ్చి.. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమ అధికారిణి సబిత హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి వెళ్తున్న పిల్లలకు టీసీలు అందించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ.. మూడేండ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. దీని వల్ల మానసిక, శారీరక, భౌతిక, సృజనత్మక, శాస్త్రీయత, ఆరోగ్యం, సంసిద్ధతతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వనజ, సూపర్‌వైజర్ ఫర్హా, వార్డు ఆఫీసర్ సునీత, ఏఎన్ఎం తులసీ, ఆర్పీ ఫరీదా, మిషన్ వాత్సల్య జెండర్ స్పెషాలిస్ట్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరుతున్న ఐసీడీఎస్ అర్బన్ సూపర్ వైజర్ ఫర్హా, సిబ్బంది

పత్తి సాగుపై దృష్టి సారించాలి..

- రైతు నేస్తంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ, జూన్ 11 : రైతులు అధిక సాంద్రత గల పత్తి సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. రైతులు సేంద్రియ వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వానకాలం పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలతో ఇచ్చోడ, సిరికొండ మండలాల రైతులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, వ్యవసాయ ఏడీ రాం కిషన్, మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాష్, తహసీల్దార్ తుకారం పాల్గొన్నారు.

రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

రైతునేస్తం కార్యక్రమాన్ని తిలకిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్‌లో కలెక్టర్

సారంగాపూర్, జూన్ 11 : మండలంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో రైతులు సాగుచేసే యాజమాన్య పంటలపై శాస్త్రవేత్తలు చెప్పిన పద్ధతులు, పోషకాలు, యాజమాన్య విధానాలు, విత్తనాల ఎంపిక, అధిక సాంద్రత పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం కార్యక్రమాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్(వీసీ)లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం సారంగాపూర్‌లో నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, డంప్ యార్డు, ఇంటింటికీ నల్లా నీరు వంటి పనులను పరిశీలించారు. అలాగే చించోలి(బి)లో సేంద్రియ ఎరువులతో వివిధ పంటలు సాగు చేస్తున్న విధానాన్ని రైతు మన్మోహన్‌రెడ్డిని ఆడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏడీఏ అంజిప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.